సాక్షి సిద్దిపేట

మంగళవారం । 20 । జూన్ । 2023



గజ్వేల్ జిగేల్
2022-23 సంవత్సరానికి గాను స్వచ్ఛభారత్ అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో గజ్వేల్ జిల్లా ఆస్పత్రి, పలు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు ఎంపికయ్యాయి. 8లో..



తరగతిలో గదిలో ఒకే ఒక్కడు
తరగతి గదిలో ఉన్న ఒకే ఒక విద్యార్థికి టీచర్ పాఠాలు బోధిస్తున్న ఉదంతం నార్సింగి మండలం జప్తి శివనూర్ సరోజినగర్ ప్రాథమిక పాఠశాలలో వెలుగుచూసింది. 8లో..



అవినీతిపై విచారణ జరపాలి
పట్టణంలోని ఎల్లమ్మ చెరువు మినీట్యాంక్ బండ్ పనుల్లో అవినీతిపై విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తూ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.. 9లో..

న్యూస్‌రీల్

విద్యాదినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటకమాన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న విద్యా దినోత్సవం ఏర్పాట్లను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సోమవారం పరిశీలించారు. పార్కింగ్, భోజన ఏర్పాట్లను చూడాలని పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఆదేశించారు. ఆయనతో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ఓఎస్డీ బాల్‌రాజు, శేషుకుమార్, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, త్రీ టౌన్ సీఐ భానుప్రకాష్, విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న విద్యా దినోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లుత జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌లు హాజరవుతారని, పాఠశాలలకు ట్యాబ్‌ల పంపిణీ, పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత, పది జీపీఏ సాధించిన 10జీపీఏ సాధించిన విద్యార్థులకు సన్మానం ఉంటుందన్నారు.

అభినందన



పదోన్నతి పొందిన అధికారులతో సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ మహేందర్

సిద్దిపేటకమాన్: పదోన్నతితో బాధ్యత పెరుగుతుందని పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. కమిషనరేట్ పరిధిలో సీఐగా పదోన్నతి పొందిన ఐదుగురు అధికారులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మూడు స్టార్లు ఉన్న చిహ్నాలను అలంకరించారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పోలీసుశాఖకు పేరు తేవాలన్నారు. పదోన్నతి పొందిన వారిలో పల్లె శ్రీధర్‌గౌడ్, రంగాకృష్ణ, సంపత్‌కుమార్, మహేందర్, ప్రవీణ్‌రాజ్ ఉన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎస్.మహేందర్, ఎస్బీ సీఐ రఘుపతిరెడ్డి, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ జయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుతో కలిసి మాట్లాడారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు అందజేయాలని, ధాన్యం డబ్బులు త్వరగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు బాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్, జయంత్, కృష్ణారెడ్డి, బాలయ్య, పర్శరాములు, ఎల్లయ్య పాల్గొన్నారు.

'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్: కేంద్రంలో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం గజ్వేల్‌లో కేక్ కట్ చేసి, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో రాహుల్ గాంధీ నిరంతర పోరాటం చేస్తున్నారన్నారు. రాహుల్ పాదయాత్ర చేపట్టగా, ప్రజల నుంచి భారీ స్పందన వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అందిస్తున్న రుణాల కోసం కులం, ఆదాయం ధృవీకరణ పత్రాల పంపిణీలో జాప్యం జరుగుతోందని అన్నారు. సోమవారం గజ్వేల్ తహసీల్దార్ బాల్‌రాజుకు సమస్యను వివరించి ధృవీకరణ పత్రాలు త్వరగా అందించాలని కోరారు.

పడిగాపులు

- భారీగా దరఖాస్తుల పెండింగ్
- సర్టిఫికెట్ల కోసం అర్హుల ఇక్కట్లు
- తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చక్కర్లు
- మీసేవ నిర్వాహకుల అధిక వసూళ్లు



సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తు దారులు

సాక్షి, సిద్దిపేట: కులం, నివాస, ఆదాయ ధ్రువపత్రాల కోసం విద్యార్థులు, బీసీ కులవృత్తుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలు ప్రారంభం కావడం, మరోవైపు ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయం కోసం దరఖాస్తు చేసేందుకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పలు చోట్ల సర్టిఫికెట్ల జారీ కావడం లేదంటూ దరఖాస్తు దారులు రోడ్డెక్కుతున్నారు. కులం, నివాసం సర్టిఫికెట్లు 11,101, ఆదాయం 12,909 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తు గడువు నేటితో ముగుస్తుండటంతో లబ్ధిదారులు సర్టిఫికెట్లు వస్తాయా లేదా అని ఆందోళన చెందుతున్నారు.

సర్వర్ స్లోతో..

- జిల్లా వ్యాప్తంగా మే 18 నుంచి జూన్ 19వ తేదీ వరకు ఆదాయ సర్టిఫికెట్లకు 44,080 మంది దరఖాస్తు చేసుకోగా, 31,037లకు ఆమోదం తెలిపారు. 134 రిజక్ట్ కాగా 12,909 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- కులం సర్టిఫికెట్ కోసం 34,255 మంది దరఖాస్తు చేయగా 23,026 ఆమోదం కాగా, 128 రిజక్ట్, 11,101 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఒక్క సిద్దిపేట అర్బన్ మండలంలో 3,933 దరఖాస్తు రాగా 1,528 ఆమోదం లభించగా, ఐదు రిజక్ట్ అయ్యాయి. మరో 2,400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- కులం, ఆదాయం ధ్రువ పత్రాల కోసం దరఖాస్తు దారులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మండలాల్లో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో సర్టిఫికెట్లు కావడం లేదని దరఖాస్తుదారులు రోడ్డెక్కి ధర్నా చేశారు.
- సిద్దిపేట అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తు దారులు నిరసన వ్యక్తం చేశారు.
- మండలాల్లో పైరవీలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.300 నుంచి రూ.500ల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

వారం రోజులవుతోంది



బీసీ కుల వృత్తిదారులకు ప్రభుత్వం అందించే సాయం కోసం వారం రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశా. ధ్రువపత్రాల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని జరగడంలేదు. సర్వర్ స్లో సమస్యతో ప్రతీ రోజు ఎదురుచూడాల్సి వస్తోంది. – గణేష్, భూంపల్లి

పని వదిలి తిరుగుతున్నం



మేం కూలి పని చేసుకొని బతికేటోళ్లం. సర్టిఫికెట్ల కోసం పనికి వెళ్లకుండా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నం. అధికారులు స్పందించి త్వరగా సర్టిఫికెట్లు ఇప్పించాలి. – పుల్లోజు శాంతవ్వ, మందపల్లి

- తహసీల్దార్ వద్ద సర్టిఫికెట్ ఆమోదమైనా కొన్నిచోట్ల మీసేవ కేంద్రాల నుంచి ప్రింట్ రావడం లేదు. సర్వర్ బిజీ కావడంతో ఆలస్యమవుతుందని మీసేవ నిర్వాహకులు చెబుతున్నారు.
- సర్వర్ స్లోతో ఒక్కో దరఖాస్తుకు 20 నిమిషాలపైనే సమయం పడుతుండడంతో జనాలు బారులు తీరుతున్నారు.
- మీ సేవ సెంటర్ నిర్వాహకులు దరఖాస్తు చార్జీలు, ఆన్‌లైన్ నమోదు చార్జీలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని దరఖాస్తుదారులు చెబుతున్నారు.
- సర్టిఫికెట్ దరఖాస్తు చేసుకోవడానికి నిబంధనల ప్రకారం రూ.45 తీసుకోవాల్సి ఉండగా రూ.80 వసూలు చేస్తున్నట్లు సమాచారం.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

25వ తేదీ తర్వాత ఎప్పుడైనా..

- గౌరవెల్లి ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): త్వరలో గోదావరి జలాలు మెట్టప్రాంతమైన హుస్నాబాద్‌ను ముద్దాడుతాయని, ఈ నెల 25వ తేదీ తర్వాత సీఎం కేసీఆర్ చేతుల మీదుగా గౌరవెల్లి రిజర్వాయర్‌ను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. సోమవారం గౌరవెల్లి రిజర్వాయర్‌ను సందర్శించి, రిజర్వాయర్ కట్టను, కుడి, ఎడమ కాల్వల ఆయకట్టు తూము షెట్టర్ల బిగింపు పనులను పరిశీలించారు. అనంతరం రిజర్వాయర్ చీఫ్ ఇంజినీర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

8.23 టీఎంసీల సామర్థ్యం

మిడ్ మానేరు నుంచి గౌరవెల్లికి కాళేశ్వరం జలాలు రాబోతున్నాయని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. 1.4టీఎంసీగా ఉన్న రిజర్వాయర్‌ను సీఎం కేసీఆర్ 8.23టీఎంసీలకు పెంచారన్నారు. 96 మెగావాట్స్ సామర్థ్యం కలిగిన 2 పంపులు ఎప్పుడూ పని చేస్తాయని, ఒక పంపు స్పేర్‌లో ఉంటుందన్నారు. మొత్తం 3,870 ఎకరాల స్థల సేకరణ చేసి బాధితులకు మెరుగైన పరిహారం చెల్లించామన్నారు. ప్రాజెక్టుకు 47కిలో మీటర్ల మేర ఉన్న కుడి కాల్వ ద్వారా 90వేల ఎకరాలకు 16కిలో మీటర్ల మేర ఉన్న ఎడమ కాల్వ ద్వారా 16వేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. కాల్వల మరమ్మతుకు రూ.250కోట్లు కేటాయించామని, గండిపల్లి ప్రాజెక్టు పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

1.6ఎకరాలకు సాగునీరు

హుస్నాబాద్ నియోజకవర్గంలో అక్కన్నపేట మండలంలో 4,228 ఎకరాలు, హుస్నాబాద్ మండలంలో 10,582 ఎకరాలు, కోహెడ మండలంలో 11,900 ఎకరాలు, సైదాపూర్ మండలంలో 5,671 ఎకరాలు, చిగురుమామిడి మండలంలో 14,963 ఎకరాలు, భీమదేవరపల్లి మండలంలో 10,508 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అంతేకాకుండా హనుమకొండ జిల్లాలోని వేలేరు, ధర్మసాగర్, కాజీపేట మండలాల్లో 34,832 ఎకరాలు, జనగామ జిల్లాలో 48,148 ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ రాములునాయక్, హనుమకొండ జిల్లా జెడ్పీ చైర్మన్ సుధీర్‌బాబు, హుస్నాబాద్ మున్సిపాల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, జెడ్పీటీసీ భూక్య మంగ, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ రజని, ఎంపీపీ లకావత్ మానస, వైస్ ఎంపీపీ మజ్జిగ మొగలి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు మాలోతు సత్యంనాయక్, నాయకులు భూక్య రమేష్‌నాయక్, యాస శ్రీనివాస్, సమ్మయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



గౌరవెల్లి రిజర్వాయర్ కట్టపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

రూ.78 కోట్లతో జిల్లా జైలు

- ఎన్సాన్‌పల్లి శివారులో ఏర్పాటు
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఎన్సాన్‌పల్లి శివారులో జిల్లా జైలు ఏర్పాటు కానుంది. రూ.78 కోట్ల వ్యయంతో 34 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టనున్న భవానికి మంగళవారం ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ప్రస్తుతం పట్టణంలో 15 మంది ఖైదీల కెపాసిటీతో సబ్ జైలు కొనసాగుతుండగా ఎన్సాన్‌పల్లిలో 21 ఫీట్ల ఎత్తుతో హై సెక్యూరిటీ గోడలు, 17 బ్లాక్‌లతో కొత్త జైలు త్వరలో అందుబాటులోకి రానుంది. కొత్త జైలులో అడ్మిన్ బ్లాక్, హాస్పిటల్ బ్లాక్, క్వార్టర్స్, రిసెప్షెన్, అడ్మిన్ బ్లాక్, డార్మెటరీ, లైబ్రెరీ, ఫీమెల్ బ్లాక్, పురుషులు, మహిళలు వేర్వేరుగా లాకప్‌లు, ఇతర సదుపాయాలు కల్పించనున్నారు. సుమారు 500 మంది ఖైదీల కెపాసిటీ, 50 మంది సిబ్బంది విధులు నిర్వహించేలా నిర్మించనున్నారు. 18 నెలల్లో నిర్మాణం పూర్తి అందుబాటులోకి తేనున్నట్లు పోలీస్ హౌసింగ్ ఏఈ సుధాకర్ తెలిపారు.



జిల్లా జైలు భవనం నమూనా

ముస్త్యాల కార్యదర్శి సస్పెన్షన్

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ముస్త్యాల పంచాయతీ కార్యదర్శి పాకాల నవ్యను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ తారిక్ అన్వర్ తెలిపారు. నో డ్యూ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ముస్త్యాలకు చెందిన తరిగొప్పుల బాలరాజు, తరిగొప్పుల చంద్రయ్యకు సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని బాధితులు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అనంతరం నవ్యను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. వీరన్నపేట కార్యదర్శి రాంబాబుకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

మోడల్‌గా టూటౌన్ పోలీసు స్టేషన్



నూతన భవనం నమూనా

సిద్దిపేటకమాన్: రూ.4కోట్లతో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేయనున్న టూటౌన్ పోలీసు స్టేషన్ నూతన భవనానికి మంగళవారం ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేయనున్నారు. ప్రస్తుతం స్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో 10,500 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో నూతన భవనాన్ని నిర్మించనున్నారు. రెండు అంతస్తుల్లో రిసెప్షెన్, ఏఎస్ఐ రూం, ఇంటర్వ్యూ గది, లాకప్, ఎస్‌హెచ్‌ఓ రూం, రీడింగ్ రూం, రికార్డు గది, డైనింగ్ హాల్, జిమ్, ఉమెన్ బ్యారెక్, మెయిన్ బ్యారెక్, మీటింగ్ హాల్ ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు. ఆరు నెలల్లో అందుబాటులోకి రానుంది.

ప్రజావాణికి 49 దరఖాస్తులు

అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సిద్దిపేటరూరల్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు హాజరుకావాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణికి ప్రభుత్వ శాఖల సబ్‌ఆర్డినేట్‌లు కాకుండా శాఖ అధికారి హాజరుకావాలని, సెలవులో ఉంటే ముందుస్తుగా సమాచారం అందించాలన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. భూ సంబంధిత, డబుల్‌బెడ్రూం, పెన్షన్లు తదితర సమస్యలపై 49 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రెహమన్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



గ్రామాన్ని విడదీయొద్దు

హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో బస్టాండ్ ప్రాంతాన్ని నూతన గ్రామపంచాయతీగా మార్చొద్దని గ్రామస్తులు కోరారు. గ్రామాన్ని రెండుగా విడదీస్తే భూములకు సంబంధించి ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అధికారులు స్పందించి అలాగే కొనసాగించాలని కోరారు.
– పందిల్ల గ్రామస్తులు

పట్టా చేయండి సారూ

మాది మల్లన్నసాగర్ ముంపు గ్రామం పల్లెపహాడ్. ముంపులో భాగంగా అందించిన ఇళ్ల పట్టాలపై మా భర్తల పేర్లు ఉన్నాయని, వాటిని తమ పేరుపై మార్పు చేయాలని గ్రామానికి చెందిన మహిళలు కోరారు. కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి, న్యాయం చేయాలని కోరారు. స్పందించిన అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ వారి వద్దకు వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీరి నిరసనకు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద పవన్, కృష్ణ మద్దతు తెలిపారు.
– భూబాధితులు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ములుగు మండలం కొక్కొండ గ్రామంలో 40 ఎకరాల్లో ఉన్న బండ చెరువును పూడ్చి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోదా అరుణ్ యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి సందబోయిన ఎల్లయ్య కోరారు. సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందజేసారు. అక్రమంగా చెరువులో చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని, చెరువు భూమిని కాపాడాలని కోరారు.
– వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హరితహారంతో పూర్వ వైభవం

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

కొండపాక(గజ్వేల్): హరితహారంతో అడవులకు పూర్వ వైభవం వచ్చిందని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మర్పడ్గ గ్రామ శివారు ఆక్సిజన్ పార్కులో సోమవారం డీఎఫ్ఓ శ్రీనివాస్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, వర్షాలు విస్తారంగా కురిసేందుకు మొక్కలు నాటాలన్నారు. హరిహారంలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 7.28కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. దీంతో పచ్చదనం 6.4 శాతం నుంచి 14 శాతానికి పెరిగిందన్నారు. సైకిల్ పద్ధతిలో మొక్కలు నాటడం వల్ల త్వరగా పెరిగేందుకు అవకాశం ఉంటుందని, భవిష్యత్ తరాలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు ప్రతీ ఒక్కరు మొక్క నాటి సంరక్షించాలన్నారు. ఆక్సిజన్ పార్కులో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏమల్ల రజిత, అటవీశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో..

సిద్దిపేటకమాన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో సీపీ శ్వేత మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, భావితరాల భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని మొక్కలు నాటాలన్నారు. పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవం రోజున మొక్కలు నాటడం, బహుమతిగా అందజేయడం అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఆయా చోట్ల నిర్వహించిన కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీలు సుభాష్ చంద్రబోస్, రామచంద్రరావు, సీఐలు రవికుమార్, భానుప్రకాష్, జానకీరామ్‌రెడ్డి, ఆర్ఐలు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, ధరణికుమార్, ఆర్ఎస్ఐలు రోహిత్, సాయిచరణ్, రంజిత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొండపాక(గజ్వేల్): ఆక్సిజన్ పార్కులో మొక్క నాటుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

మెడికల్ కళాశాల ఆవరణలో..

నాటిన ప్రతీ మొక్కను కాపాడాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కళాశాల ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్‌బాబు, మెడికల్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కలు నాటాలి

గజ్వేల్: పచ్చదనం పెంపునకు ఉద్యమంలా మొక్కలు నాటాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం గజ్వేల్ అర్బన్ పార్కులో నిర్వహించిన హరితోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కల పెంపు, అడవుల పునరుద్ధరణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ హరితహారం చేపట్టారన్నారు. హరితోత్సవంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం పార్కులో మొక్కలు నాటారు. ఎఫ్ఆర్ఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్ అర్బన్ పార్కులో మొక్క నాటుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



సిద్దిపేటకమాన్: సీఏఆర్ హెడ్ క్వార్టర్ ఆవరణలో మొక్కకు నీరు పోస్తున్న సీపీ శ్వేత



మొక్క నాటుతున్న డైరెక్టర్ విమలాథామస్, సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్

క్లుప్తంగా

ఆటో అప్పగింత

సాక్షి ఎఫెక్ట్

తూప్రాన్ : పట్టణ కేంద్రంలో మూడు నెలలుగా వదిలి వెళ్లిన ఆటోను పోలీసులు తిరిగి బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ సురేశ్‌కుమార్ సోమవారం పేర్కొన్నారు. 'సాక్షి'లో ఈ నెల 18న ఆదివారం 'ఆటో పరేషన్?' అనే పేరుతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పోలీసులు ఆటో మిస్సింగ్‌పై దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన చిలివేరి శ్రీనివాస్ అనే వ్యక్తి గత ఏప్రిల్ 4న తన ఇంటి ముందు రాత్రి వేళ పార్కు చేసిన ఆటో చోరీకి గురైనట్లు కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. పోలీసులు బాధితుడితో వచ్చి పరిశీలించిన అనంతరం అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. దీంతో శ్రీనివాస్ 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపాడు.

నీ తల్లిని చంపేస్తానంటూ బెదిరింపులు

బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి

శివ్వంపేట(నర్సాపూర్) : స్నేహితురాలి అన్న ఓ బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడిన ఉదంతం సోమవారం వెలుగుచూసింది. శివ్వంపేట మండలంలోని ఓ గ్రామంలో బాలిక (14) తన స్నేహితురాలి దగ్గరికి చదువుకోవడానికి రోజూ వెళ్తోంది. ఆమెపై స్నేహితురాలి అన్న కన్నేశాడు. 'నేను చెప్పినట్లు వినకుంటే నీ తల్లిని చంపేస్తానని బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డారు. దీంతో బాలిక 5 నెలల గర్భవతి అయ్యింది. బాలిక శరీరంలో మార్పులను గమనించిన ఆమె మేనత్త, ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షల చేయించగా 5 నెలల గర్భిణిగా వైద్యులు తెలిపారు. కాగా పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా సదరు వ్యక్తి ఒప్పుకుని తర్వాత మాటమార్చడంతో బాధితురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఇరుక్కున్న పాము చివరికి..



పాము కళేబరం

దుబ్బాక రూరల్: ఓ పాము ట్రాన్స్‌ఫార్మర్‌లో ఇరుక్కుని కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగించింది. చివరికి మృత్యువాత పడింది.. తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని చీకోడ్ రోడ్డులో 1523 సర్వే నంబర్‌లో గల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లో పాము చొచ్చుకొని పోవడంతో మంటలు చెలరేగాయి. మంటలు చెలరేగడంతో పాటుగా ట్రాన్స్ ఫార్మర్‌లోని కొంత భాగం దెబ్బతింది. దీంతో 8 గంటలకు పైగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ షాక్ తగలడంతో పాము మృత్యువాత పడింది.

గజ్వేల్ జిగేల్

- స్వచ్ఛత కేటగిరిలో 87.47 స్కోర్‌తో జిల్లా ఆస్పత్రి రన్నరప్
- ప్రోత్సాహక కేటగిరిలో దుబ్బాక ఏరియా ఆస్పత్రి ఎంపిక
- ఉత్తమ పీహెచ్‌సీగా పుల్లూరు
- 2022-23కు గాను కాయకల్ప అవార్డులను ప్రకటించిన కేంద్ర ఆరోగ్య శాఖ

సిద్దిపేటకమాన్: కేంద్ర ఆరోగ్యశాఖ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్వచ్ఛత(పరిశుభ్రత, శానిటేషన్)ను ప్రోత్సహించేందుకు కాయకల్ప అవార్డులకు ఇస్తోంది. 2022-23 సంవత్సరానికి గాను స్వచ్ఛభారత్ అభియాస్, (ఎన్‌హెచ్‌ఎమ్) నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో జిల్లా నుంచి గజ్వేల్ జిల్లా ఆస్పత్రి, పలు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు ఎంపిక య్యాయి. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మే 30న కాయకల్ప అవార్డులను ప్రకటించింది. ప్రతి సంవత్సరం ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక (కమెండేషన్) బహుమతులు అందజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొదటి స్థానంలో నిలిచిన జిల్లా ఆస్పత్రులకు రూ.50లక్షలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు రూ.15లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లకు రూ.2లక్షలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, పల్లె దవాఖానలకు రూ.1లక్ష చొప్పున నగదు పురస్కారం అందిస్తోంది.

రన్నరప్‌గా నిలిచిన 'గజ్వేల్'కు రూ.20 లక్షలు

రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఉన్న జిల్లా ఆస్పత్రుల్లో ఉన్న సదుపాయాలు, శానిటేషన్, స్వచ్ఛత, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న సేవలను పరిగణలోకి తీసుకుని మార్కులను వైద్యారోగ్యశాఖ కేటాయించింది. 2022-23 సంవత్సరానికి గాను జిల్లా ఆస్పత్రుల్లో ఉత్తమ జిల్లా ఆస్పత్రిగా 92.13 స్కోర్‌తో కొండాపూర్ ప్రథమ స్థానంలో నిలవగా, గజ్వేల్ జిల్లా ఆస్పత్రి పలు అంశాల్లో 87.47 స్కోర్ సాధించి, రన్నరప్‌గా నిలిచి, రూ. 20 లక్షలు గెలుచుకుంది.

కమెండేషన్‌లో దుబ్బాక ఏరియా ఆస్పత్రికి లక్ష

జిల్లాలోని ఏరియా హాస్పిటల్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వసతుల కల్పన, శానిటేషన్, స్వచ్ఛత, ఉత్తమ వైద్య సేవలు, పలు అంశాలను పరిగణలోకి తీసుకుని మార్కులు కేటాయిస్తూ అత్యధిక మార్కులు సాధించిన ఆస్పత్రులను కాయకల్ప అవార్డులకు అధికారులు ఎంపిక చేస్తున్నారు. దుబ్బాక ఏరియా ఆస్పత్రి పలు విభాగాల్లో 78.0 స్కోర్ సాధించి కమెండేషన్ విభాగంలో ఎంపికై రూ.1 లక్ష బహుమతిని గెలుచుకుంది.

ఉత్తమ పీహెచ్‌సీగా పుల్లూరు, యూపీహెచ్‌సీగా నాసర్‌పూర..

రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సైతం ఈ అవార్డులను ప్రకటించారు. జిల్లాలో ఉత్తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విభాగంలో పుల్లూరు పీహెచ్‌సీ 83.6 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచి రూ.2లక్షల బహుమతి గెలుచుకోగా, కమెండేషన్ విభాగంలో చిన్నకోడూర్ పీహెచ్‌సీ, తిమ్మాపూర్, కుకునూర్‌పల్లి, మర్కూక్, గట్లమల్యాల, రామవరం పీహెచ్‌సీలు ఒక్కొక్కటి రూ.50వేల చొప్పున బహుమతిని గెలుచుకున్నాయి.



సిద్దిపేట అర్బన్ నాసర్‌పూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఫైల్)

అర్బన్ పీహెచ్‌సీ విభాగంలో పలు విభాగాల్లో 77.9 స్కోర్ సాధించి సిద్దిపేట అర్బన్ నాసర్‌పూర మొదటి స్థానంలో నిలిచి రూ. 2లక్షలు, 76.3 స్కోర్ సాధించి అంబేడ్కర్‌నగర్ యూపీహెచ్‌సీ కమెండేషన్ విభాగంలో ఎంపికై రూ.50వేలు గెలుచుకుంది.

ఏడు పల్లె దవాఖానాలు కూడా

జిల్లాలోని 07 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, పల్లె దవాఖానాలు కాయకల్ప అవార్డుకు ఎంపికయ్యాయి. ఇందులో గుర్రాలగొంది మొదటి స్థానంలో నిలిచి రూ.1లక్ష గెలుచుకోగా, తడ్కపల్లి రన్నరప్‌గా నిలిచి రూ.50వేలు గెలుచుకుంది. కమెండేషన్ విభాగంలో వట్టిపల్లి, ఇర్కోడు, గుడికందుల, కట్కూర్ రూ.25వేల చొప్పున గెలుచుకున్నాయి.

జిల్లాలో కాయకల్ప అవార్డు కింద తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని 02 ఆస్పత్రులు (రూ.21లక్షలు) గెలుచుకోగా, 07 పీహెచ్‌సీలు (రూ.5లక్షలు), 02 యూపీహెచ్‌సీలు (రూ.2.5లక్షలు), 07 పల్లె దవాఖానాలు (2.85లక్షలు) ఎంపికయ్యాయి. జిల్లాలో మొత్తం పొందిన బహుమతి రూ.31.35లక్షలు.

సమష్టి కృషి ఫలితం



జిల్లాలోని గజ్వేల్ జిల్లా ఆస్పత్రి, దుబ్బాక ఏరియా హాస్పిటల్ తోపాటు పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నాసర్‌పూర అర్బన్ పీహెచ్‌సీ, అంబేడ్కర్ నగర్ యూపీహెచ్‌సీతో పాటు మరి కొన్ని పీహెచ్‌సీలు, 07 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, పల్లె దవాఖానలు కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఆస్పత్రిలోని శానిటేషన్, స్వచ్ఛత, పరిశుభ్రత, హైజీన్, వసతుల కల్పన, మెరుగైన వైద్య సేవలు అందించడం వంటి పలు అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. సమష్టి కృషి ఫలితంగా అందరి సహకారంతో ఈ అవార్డులు వచ్చాయి.

–డాక్టర్ కాశీనాథ్, డీఎంహెచ్ఓ, సిద్దిపేట

108 అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో బిడ్డతో బంధువులు

హుస్నాబాద్ : కోహెడ మండలం సముద్రాలకు చెందిన పోలోజు రేణుకా సోమవారం అంబులెన్స్‌లోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం సముద్రాలకు చెందిన పోలోజు రేణుకా ప్రసవ నొప్పులు రావడంతో హుస్నాబాద్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి బయలుదేరారు. మార్గ మధ్యలో రేణుకకు తీవ్రమైన నొప్పులు రావడంతో ఈఆర్‌సీపీ డాక్టర్ శ్రీకాంత్, మహిళ బంధువుల సహకారంతో డెలివరీ చేశారు. మగబిడ్డకు రేణుక జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో అంబులెన్స్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. బంధువులు ఈఎంటీ శ్రీనివాస్, పైలెట్ రాజిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

వలస కూలీ కూతురి అదృశ్యం

ఝరాసంగం(జహీరాబాద్): బాలిక అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రంలోని చించోలి నియోజకవర్గంలోని సంగాపూర్ గ్రామంకు చెందిన జాదవ్ కిషన్, మామిడి గ్రామ శివారులోని ఓ రైతు పొలం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి వలస వచ్చారు. అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం ఉదయం 6గంటలకు నిద్ర లేచి చూడగా తన కూతురు(15) కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తండ్రి జాదవ్ కిషన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేందర్‌రెడ్డి కేసు దార్యాప్తు చేస్తున్నారు.

తరగతిలో గదిలో ఒకే ఒక్కడు



విద్యార్థికి పాఠాలు బోధిస్తున్న టీచర్

రామాయంపేట(మెదక్): తరగతి గదిలో ఉన్న ఒకే ఒక విద్యార్థికి టీచర్ పాఠాలు బోధిస్తున్న ఉదంతం నార్సింగి మండలం జప్తి శివనూర్ సరోజినగర్ ప్రాథమిక పాఠశాలలో వెలుగుచూసింది. ఇక్కడ ఐదో తరగతి వరకు విద్యనభ్యసించవచ్చు. కాగా స్కూల్లో మొత్తానికి నలుగురు విద్యార్థులు చేరడం గమనార్హం. సోమవారం 'సాక్షి' ప్రతినిధి స్కూల్‌ను సందర్శించగా తరగతి గదిలో ఒకే ఒక్క విద్యార్థి ఉండగా టీచర్ అతడికే పాఠాలు చెబుతుండటం కనిపించింది. దీనిపై టీచర్ స్పందిస్తూ ఉదయం ముగ్గురు విద్యార్థులు స్కూలుకు వచ్చారని, భోజనం చేసిన అనంతరం ఇద్దరు వెళ్లిపోయారని చెబుతోంది. జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌ను విషయమై ఫోన్‌లో సంప్రదించగా, తన దృష్టికి రాలేదని జవాబునిచ్చారు. తాను స్కూల్‌ను సందర్శించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా ముగ్గురికి పదోన్నతి

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు సబ్-ఇన్‌స్పెక్టర్‌లకు పదోన్నతి కల్పిస్తూ డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా ఎన్నో విపత్కర పరిస్థితులలో తమ విధులను సక్రమంగా నిర్వహించి సు. దీర్ఘ సర్వీసులో ఎలాంటి రిమార్క్ లేకుండా బాధ్యతను నిర్వర్తించిన బాలస్వామి (డీ.సీ.ఆర్.బీ), గణేష్(అమీన్‌పూర్), పరమేశ్వర్ (జహీరాబాద్ రూరల్) ఇన్‌స్పెక్టర్స్‌గా పదోన్నతి పొందారన్నారు. పదోన్నతి పొందిన ఇన్‌స్పెక్టర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

హజ్ యాత్రికులకు వీడ్కోలు



కర్ణాటక మంత్రి రహీంఖాన్‌ను సత్కరిస్తున్న తన్వీర్

జహీరాబాద్: హజ్ యాత్రకు బయలుదేరి వెళుతున్న యాత్రికులకు కర్ణాటక రాష్ట్ర మంత్రి రహీంఖాన్ వీడ్కోలు పలికారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని జేజే ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీదర్‌కు చెందిన యాత్రికులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో మంత్రితో పాటు మైనార్టీ కమిషన్ సభ్యుడు తన్వీర్ పాల్గొన్నారు. జహీరాబాద్ నుంచి వెళ్తున్న యాత్రికులకు జీకాట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఢిల్లీ వసంత్ సత్కరించి వీడ్కోలు పలికారు.

ఇసుక ఫిల్టర్ల కూల్చివేత



కంది(సంగారెడ్డి): మండలపరిధిలోని బ్యాతోల్, ఎర్ధనూర్ శివారుల్లో కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న ఫిల్టర్లను రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేసినట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. ఎర్ధనూర్, బ్యాతోల్ శివారుల్లో కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఫిల్టర్లపై దాడి చేసి, జేసీబీలతో కూల్చి వేశారని, ఇసుకను తరలిస్తున్న 2 లారీలను పట్టుకుని సీజ్ చేశారని వెల్లడించారు. ఇసుక ఫిల్టర్లు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తామని విజయలక్ష్మి హెచ్చరించారు.

6నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

కోహెడరూరల్ (హుస్నాబాద్): పాఠశాల బస్సును రెండుసార్లు అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారకుడైన వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ 6 నెలల పాటు రద్దు చేసినట్టు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. మండలంలోని శనిగరం శివారులోని సెయింట్ పల్లోటి కాన్వేంట్ పిల్లల బస్సును 4 నెలలలో 2 సార్లు అజాగ్రత్తగా నిర్లక్ష్యంతో నడిపి ప్రమాదానికి కారణమైన కల్లెపల్లి రాజశేఖర్ (25)పై రెండు కేసులున్నాయి. ఈ మేరకు పోలీసులు కోర్టులో చార్జిషీట్ చేశారు. దీంతో రాజశేఖర్ పై మెజిస్ట్రేట్ రెండు కేసుల్లో జరిమానా విధించారు. కాగా ఎస్ఐ, నిందితుడి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలని సిద్దిపేట ఆర్‌డీఓ దుర్గప్రసాద్‌కు లేటర్ పంపగా సోమవారం 6 నెలల పాటు లైసెన్స్ రద్దు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నిందితుడికి ఏడేళ్ల జైలు

సిద్దిపేటకమాన్ : వరకట్న మరణం కేసులో నిందితుడికి 7 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ సిద్దిపేట కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 'సిద్దిపేట హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న దారం సత్యనారాయణ అలియాస్ సతీష్‌కు ఆకుల నర్సయ్య మూడో కూతురు అర్చనతో 2016 మార్చి 24న వివాహమైంది. ఆరు నెలల తర్వాత అదనపు కట్నం కోసం సత్యనారాయణ తన భార్యను వేధించగా పెద్ద మనుషుల సమక్షంలో రాజీ కుదుర్చుకున్నారు. అయినా అతడి తీరులో మార్పు రాలేదు. 2018 జూన్ 15న అర్చనను కొట్టగా ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై ఆమె కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అప్పటి వన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. ఏసీపీ రామేశ్వర్ కేసును విచారించి సత్యనారాయణను అరెస్టు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ కోర్టులో విచారణ అనంతరం నిందితుడు సత్యనారాయణ అలియాస్ సతీష్‌పై నేరం రుజువైనందున జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం, నిందితుడికి 7 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష విధించారని' ఏసీపీ దేవారెడ్డి తెలిపారు. కేసు ఇన్వెస్టిగేషన్ చేసిన పోలీసు అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను, కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు.

బతుకుదెరువు కోసం వచ్చి..

పటాన్‌చెరు టౌన్ : మద్యంమత్తులో చెరువులో ఈత కొట్టేందుకు దిగిన ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లా అన్నవరం మండలం చెందిన పంటాడి దుర్గాప్రసాద్(35) బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ లో కార్పెంటర్‌గా పనిచేస్తున్నారు. మూడేళ్ల క్రితమే భార్యతో విడాకులు తీసుకున్నాడు. నాటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం అమీన్‌పూర్ పెద్ద చెరువులోకి ఈత కొట్టేందుకు దిగి ప్రవాహానికి మునిగిపోయాడు. స్థానికులు.. దుర్గాప్రసాద్ సెల్ ఫోన్ ఆధారంగా అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు సోమవారం అమీన్‌పూర్‌కు చేరుకున్నారు. అప్పటికే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు పంటాడి శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

రేషన్ డీలర్‌పై ఫిర్యాదు




ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లి-1 రేషన్ దుకాణం డీలర్ రెండు నెలలుగా రేషన్ బియ్యం ఇవ్వడంలేదంటూ గ్రామస్తులు ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూవృద్ధులతో పాటు మరికొందరి బయోమెట్రిక్ వేలిముద్రలు తీసుకుని బియ్యం రాలేదని, వచ్చాక ఇస్తానంటూ కాగితాలపై టోకెన్లు రాసిస్తూ బియ్యం వచ్చినా ఇవ్వడం లేదని వాపోయారు. ఇలా దాదాపు 82 క్వింటాళ్ల బియ్యం మాయం చేశాడని ఆరోపించారు. దీంతో సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకొని బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కోరారు. విచారణ జరిపించి కలెక్టర్‌కు నివేదిక పంపాలని తహశీల్దార్ మురళీధర్‌ను ఆర్డీఓ ఆదేశించారు.

వార్డు కమిటీలను ఎప్పుడు నియమిస్తారు?: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలో వార్డు కమిటీలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నాలుగు వారాలు సమయం ఇస్తున్నామని, ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 21కి వాయిదా వేసింది. జీహెచ్‌ఎంసీలో వార్డు కమిటీలు ఏర్పాటు చేయాలని వార్డు కార్యాలయాలను ఆపి వేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. 'ప్రతి మున్సిపల్ వార్డులో స్థానికులతో వార్డు కమిటీ వేయాలని రాజ్యాంగం చెబుతోంది. ఈ కమిటీలు వార్డు స్థాయి పాలనలో నిర్ణయాలు తీసుకుంటాయి. దీంతో పారదర్శకత పెరిగి అవినీతి తగ్గుతుంది. ఈ కమిటీలను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం అధికారులతో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసింది. ఇది సమర్థనీయం కాదు. వెంటనే వార్డు కమిటీలు వేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలి' అని పిటిషన్ లో పేర్కొంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. కౌంటర్ దాఖలు చేయడానికి ప్రభుత్వానికి 4 వారాల గడువు ఇస్తూ, విచారణను వాయిదా వేసింది.

పీజీ కాలేజీల డైరెక్టర్ నియామకం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అనుబంధంగా కొనసాగుతున్న పీజీ కాలేజీల డైరెక్టర్‌గా ప్రొ.రవికుమార్ నియమితులయ్యారు. ఓయూ పరిధిలోని సిద్దిపేట, వికారాబాద్, నర్సాపూర్, జోగిపేట, మిర్జాపూర్ పీజీ కాలేజీల నిర్వహణకు రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో..

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన హరితహారం కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ ఈ వేడుకల్లో పాల్గొని అందరినీ ఉత్సాహపరిచారు. ఓఆర్‌ఆర్ పరిసర ప్రాంతాలు, జంట నగరాల్లోని 30 కేంద్రాల్లో లక్షా 50 వేలమొక్కలను పంపిణీ చేశారు.

హైవేపై కారు బోల్తా



బోల్తా పడిన కారు

రామాయంపేట(మెదక్): రామాయంపేట శివారులోని జాతీయ రహదారిపై సోమవారం కారు బోల్తా పడిన సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. కోరుట్లకు చెందిన వ్యాపారి లక్ష్మారెడ్డి, అతడి డ్రైవర్ మారుతి కారులో హైదరాబాద్ వెళ్లి తిరుగు పయనమవుతున్నారు. రామాయంపేట శివారులో కారు అదుపు తప్పి జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లక్ష్మారెడ్డి, డ్రైవర్ మారుతి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని రహదారి వెంట వెళ్తున్న ప్రయాణికులు కారులో నుంచి బయటకు తీశారు. ఈ ఘటన విషయమై ఎలాంటి ఫిర్యాదూ అందలేదని ఎస్ఐ రంజిత్ తెలిపారు.

పాపన్నపేటకు వెళుతూ పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండల పరిధిలోని మిన్‌పూర్ శివారులో సోమవారం సాయంత్రం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురై పలువురికి గాయాలయ్యాయి. ఆ సమయంలో పాపన్నపేటకు వెళ్తున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సంఘటనా స్థలం వద్ద ఆగి, క్షతగాత్రులను పరామర్శించారు. ఆటో ప్రమాదంలో గాయపడిన వారు సాయమ్మ, సంగయ్య, నారాయణలను చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పతికి 108లో పంపించారు.

ఎద్దులను తరలిస్తున్న వాహనం పట్టివేత

సిద్దిపేటఅర్బన్: అక్రమంగా తరలిస్తున్న ఎద్దులను స్వాధీనం చేసుకొని గోశాలకు తరలించినట్టు సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. మంగళవారం రంగధాంపల్లి చౌరస్తా వద్ద ఎస్సై కొమురయ్య, కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి వాహన తనిఖీలు చేస్తున్నారు.

ఈక్రమంలో అక్రమంగా ఆరు ఎద్దులను హైదరాబాద్‌కు తరలిస్తున్న వాహనాన్ని గుర్తించారు. బాధ్యులైన కొత్తగూడెం జిల్లా చర్లకు చెందిన యాకుబ్ పాషా, ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేశారు. ఎద్దులను మనోహరాబాద్‌లోని గోశాలకు తరలించారు. బక్రీద్ నేపథ్యంలో పశువుల తనిఖీ కోసం రంగధాంపల్లి చౌరస్తా వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్టు సీఐ తెలిపారు.

దుస్తులు ఉతికేందుకు వెళ్లి...



యాదమ్మ(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతురాజు యాదమ్మ(65) గ్రామ సమీపంలోని చెరువులో దుస్తులు ఉతికేందుకు వెళ్లింది. ఉతికే సమయలో ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడింది. గుర్తించిన పశువుల కాపరులు నీటిలోనుండి యదమ్మను బయటకు తీశారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషయమంగా ఉండటంతో వైద్యులు సూచన మేరకు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి చనిపోయింది. మృతురాలి కొడుకు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికాంతరావ్ తెలిపారు.

క్షణికావేశంలో ఆత్మహత్య

మెదక్ టౌన్‌లో ఘటన

మెదక్ మున్సిపాలిటీ: క్షణికావేశంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ పట్టణంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం కామారెడ్డి జిల్లా లింగంపల్లి గ్రామానికి చెందిన కోళ్ల శ్రీనివాస్ (25) మెదక్ లోని ఓ హోటల్ లో పనిచేస్తుండేవాడు. తాను, తన భార్య సుజాత తరచూ గొడవ పడుతుంటారు. ఆదివారం కూడా ఫోన్లో గొడవపడి క్షణికావేశంలో హోటల్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు ఎస్సై లింగం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచ్, ఉపసర్పంచ్ వర్గీయుల గొడవ



వెంక్యతండాలో ధ్వంసం చేసిన శిలాఫలకం

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ భవన నిర్మాణ విషయంలో సర్పంచ్, ఉపసర్పంచ్ వర్గీయుల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. మండల పరిధిలోని రెడ్యాతండా పంచాయతీకి నూతన పంచాయతీ భవనం మంజూరైంది. కాగా మంగళవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శంకుస్థాపనకు రానున్నారు. రెడ్యాతండా పంచాయతీలో నూతన భవనం కట్టాలని ఉపసర్పంచ్ వర్గీయులు, అందులో కాదు వెంక్యతండాలో నిర్మించాలని సర్పంచ్ వర్గీయుల గొడవ పడుతున్నారు. వెంక్యతండాలో భవన నిర్మాణానికి సర్పంచ్ శిలాఫలకం ఏర్పాటు చేయగా ఉపసర్పంచ్ వర్గీయులు అడ్డుకొని కూల్చివేశారు. దీంతో ఇరువర్గీయులు గొడవకు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలను నచ్చచెప్పారు. తండా ప్రజలు చర్చించుకుని భవన నిర్మాణంపై తేల్చుకోవాల్సిందిగా సూచించారు.